సీపీఐ రాష్ట్ర కార్యవర్గంలో విశాఖ నేతలకు చోటు

శుభాకాంక్షలు తెలిపిన పెందుర్తి ఏరియా నాయకులు శ్రీనివాసరావు, రాంబాబు

విశాలాంధ్ర - పెందుర్తి: సీపీఐ రాష్ట్ర కార్యవర్గంలో విశాఖ జిల్లాకు చెందిన పలువురు నాయకులకు చోటు లభించడంతో పెందుర్తి ఏరియా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు వై. రాంబాబు శుబాకాంక్షలు తెలియజేసారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగిన సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలలో విశాఖ జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఏ.విమల రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా ఎంపికయ్యారు. అలాగే రాష్ట్ర సమితి సభ్యులుగా కామ్రేడ్ సీహెచ్.రాఘవేంద్రరావు, కామ్రేడ్ షేక్ రెహమాన్, కామ్రేడ్ ఎం.పైడ్రాజు అలాగే కంట్రోల్ కమిషన్ సెక్రటరీగా ఏజే స్టాలిన్ ఎన్నికైనట్టు తెలిపారు. విశాఖ జిల్లా నాయకులకు కీలక పదవులు లభించడం ఆనందదాయకమన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గంలో విశాఖ నేతలు

రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగా ఏజే స్టాలిన్



విశాలాంధ్ర - విశాఖ: ఒంగోలు ఈనెల 23 నుండి 25 వరకు జరిగిన సిపిఐ 28వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగా జీవీఎంసీ కార్పొరేటర్, సిపిఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.విమల, రాష్ట్ర సమితి సభ్యులుగా పార్టీ సీనియర్ నాయకుడు సీహెచ్. రాఘవేంద్రరావు, పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.పైడిరాజులు ఎన్నికయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణే ధ్యేయంగా కృషి చేయాలి

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నూతనంగా నియామకమవుతున్న డీఎస్సీ 2025 ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ధ్యేయంగా కృషి చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు మంగళవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ముందుగా నూతన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో గాడిలో పెట్టాలనే యోచనతో ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీ 2025 ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను నియమించడం అభినందనీయం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ యంత్రాంగమంతా అహర్నిశలు కృషి చేసి నోటిఫికేషన్ ఇచ్చిన రెండు నెలల్లోనే నియామకాలు జరపడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాలు వలన ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, గత ఐదు సంవత్సరాల కాలంలో ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయన్నారు. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమయ్యే ప్రైవేటు పాఠశాలలు నేడు గ్రామీణ ప్రాంతాలు, చిన్నచిన్న ఆవాసాలకు సహితం స్కూల్ బస్సుల ద్వారా ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారన్నారు. ప్రతి గ్రామానికి ప్రతి ఆవాసానికి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను పెట్టినప్పటికీ విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరుగుటలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి సంస్థలు కూడా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితికి ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలే అయినప్పటికీ సంస్థ మనుగడకు ప్రతి సంస్థలోని ఉద్యోగుల పనితనం, ఆలోచన ధోరణి, పని విధానం కారణమనే వాస్తవాన్ని ఒప్పుకోక తప్పదన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకునే విధానానికి స్వస్తి పలికి మన సంస్థను కాపాడుకోవడానికి మనం చిత్తశుద్ధితో పని చెయ్యాలనే దృక్పథంతో ప్రస్తుత డీఎస్సీ 2025 ద్వారా ఉద్యోగ నియామకాలు పొందే ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని కోరారు.

రూ.2.71 కోట్ల అభివృద్ధి పనులకు గంటా శంకుస్థాపన

విశాలాంధ్ర - సాగర్ నగర్: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని రూ. 2.71 కోట్లతో ప్రతిపాదించిన రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం సాగర్ నగర్‌లో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. రూ.16 కోట్లతో సాగర్ నగర్ బీచ్ సుందరీకరణకు ప్రణాళికను సిద్ధం చేశామని, అలాగే రూ.3 కోట్లతో ఈట్ స్ట్రీట్ ప్రారంభిస్తున్నామని వివరించారు. వైసీపీ హయాంలో అయిదేళ్ల పాటు అభివృద్ధి అన్న పదాన్ని రాష్ట్ర ప్రజలు పూర్తిగా మర్చిపోయారని విమర్శించారు. సాగర్ నగర్, రాజీవ్ నగర్, వాడపాలెం, చిన్న రుషికొండ, పెద్ద రుషికొండ, తిమ్మాపురం, వికలాంగుల కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రతిపాదించిన 14 అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు చెట్టిపల్లి గోపీ, శఖారి శ్రీనివాస్, మంగాదేవి, సారిపల్లి శ్రీనివాస్, దొరబాబు, రాంబాబు, గంటా నూకరాజు, గాదు అప్పలనాయుడు, గొలగాని నరేంద్ర కుమార్, గరే గుర్నాథ్, లొడగల జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకధాటి వర్షాలు...

లోతట్టు ప్రాంతాలు జలమయం
స్తంభించిన జనజీవనం
అనేకచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: నిమిషం కూడా తెరుపు లేకుండా కురుస్తున్న ఏకదాటి వర్షాలకు ఉత్తరాంధ్ర జిల్లాలు ఉక్కిరి బిక్కిరి అయ్యాయి. విశాఖ నగరంలోని లోతట్టు ప్రాంతాలు వరద నీటితో విలవిలలాడాయి. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వెంబడి అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తారంగా కుండపోత వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల చక్రవాత ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు కొనసాగుతూ, ఎత్తు పెరిగే కొద్దీ నైరుతి దిక్కుకు వాలి ఉందని తెలిపారు. ఈ అల్పపీడనం రాగల రెండు రోజుల్లో వాయువ్యదిశలో కదిలి మరింత బలపడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వివరించారు. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపారు. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు విశాఖ నగరంలో క్షణం తీరిక లేకుండా కురుస్తున్న వర్షాలకు నగరం వరద నీటితో అల్లాడిపోయింది. కొండవాలు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఒక రాష్ట్ర హోంమంత్రి అనిత వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులతో మాట్లాడారు. కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని అధికారులు సమీక్షిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు , ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలు వరద సహాయక చర్యలపై చేపడుతున్నారు. అనేకచోట్ల రోడ్లకు గండ్లు ఏర్పడ్డాయి. గ్రామీణ ప్రాంతంలో చెరువులు రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రవాణా సౌకర్యం అనేక చోట్ల స్తంభించిపోయింది. కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సదుపాయం నిలిచిపోయింది.

అవస్థలు పడుతున్న మధురవాడ ప్రాంత ప్రజలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మధురవాడలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. వినాయక చవితి సందర్భంగా పువ్వులు, పండ్లు, గణపతి విగ్రహాల వ్యాపారం ఆశాజనకంగా జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. గత రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో క్షణం తెరుపు లేకుండా కురుస్తున్న వర్షాలకు మధురవాడ ప్రాంతంలో అనేక కాలనీలు నీటి మునిగాయి. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు ఏ క్షణం ఇల్లు కూలుతాయో అన్న ఆందోళన నివాసుల్లో నెలకొంది. మధురవాడ ప్రాంతంలో అనేక కొండవాలు ప్రాంతాలపైనే అధిక నివాసాలు కాలనీలు ఉండడంతో ఈ ఆందోళన నెలకొంది. మరోపక్క మధురవాడ సర్వీస్ రోడ్డు బ్రిడ్జి కింద చెరువులు తలపించేలా వరద నీరు ప్రవాహంలా తరుముకొచ్చింది. అధికారులు రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయకపోవడంతో అనేక రోడ్లు పరిస్థితి చెరువులా తలపించాయి. పెద్ద పెద్ద గోతుల్లో వరద నీరు చేరకపోవడంతో అనేక చోట్ల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

విశాఖ కలెక్టరేట్: వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వెంబడి అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. విశాఖపట్నం జిల్లాకు రాబోయే 24 గంటల్లో తేలికపాటి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిపిస్తుందని, గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని జిల్లా రెవిన్యూ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని "ఆరంజ్ అలెర్ట్" జారీ చేసారన్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించుటకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ వారి కార్యాలయంలో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడిందని, 0891 2590100/2590102 నెంబర్లకు సమాచారం నిమిత్తం సంప్రదించవచ్చన్నారు.

టీడీపీలో పారదర్శకంగా సంస్థాగత ఎన్నికలు: పల్లా

విశాలాంధ్ర - విశాఖ సిటీ: టీడీపీలో సంస్థాగత ఎన్నికలు పారదర్శకంగా జరుగుతాయని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు. అన్ని వర్గాల వారికి పార్టీలో అవకాశం ఉంటుందని, పార్టీ ప్రయోజనాలకు, సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నవారిని సెలెక్ట్ చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 పార్లమెంట్ అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ టీడీపీలో వార్డు అధ్యక్షుడు నుంచి జాతీయ అధ్యక్షుడు వరకూ పారదర్శకంగా ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. వైఎస్ విజయమ్మను అధ్యక్షురాలు పదవి నుంచి తొలగించేందుకు వైసీపీ ఓసారి ప్లీనరీ పెట్టుకుందని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రతి రెండేళ్లకోసారి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎంపికకు సంబంధించి అందరి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటాం అని తెలిపారు. కూటమి ప్రభుత్వ స్వచ్ఛత పాలనతో వైసీపీలో గుబులు రేగుతుందన్నారు. ప్రజల్లో అశాంతిని కలిగించేందుకు వైసీపీ ఫేక్ ప్రచారానికి పాల్పడుతోందని అన్నారు. మానవత్వం లేని జగన్ విష ప్రచారం చేయిస్తున్నాడని, స్టీల్ ప్లాంట్‌పై జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొకలా వ్యవహరిస్తున్నాడు అని అన్నారు. 14,500 కోట్ల నిధుల్ని తెచ్చి చంద్రబాబు ప్రయివేటీకరణకు బ్రేక్ వేశారని తెలియజేశారు. సమావేశంలో జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి, విశాఖ లోక్ సభ సభ్యులు ఎం.శ్రీ భరత్, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, శాసన మండలి సభ్యులు, పరిశీలకులు శ్రీరాంరెడ్డి గోపాల్ రెడ్డి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కురుపూడి సత్తిబాబు, శాసనమండలి మాజీ సభ్యులు దువ్వారపు రామారావు, కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

కేంద్ర నిధులు నేరుగా పంచాయతీలకు ఇస్తున్నాం

అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర విభజన సమయంలో కంటే గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం విపరీతంగా నష్ట పోయిందని మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పాలనలో ప్రస్తుతం అభివృద్ధి పథంలో ఏపీ నడుస్తోందన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రతి పంచాయతీ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. మంగళవారం మున్సిపల్ స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర నిధులు నేరుగా పంచాయతీలకు ఇస్తున్నామని వెల్లడించారు. ఎన్ఆర్‌జిఎస్ నిధులు సద్వినియోగం, యువతకి ఉద్యోగ కల్పన, 16 వేల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు, 6 వేల మందికి కానిస్టేబుల్ నియామకాలు జరిగాయని తెలిపారు. జన సైనికులు, వీర మహిళలు అభిప్రాయం తెలుసు కోవటానికి పవన్ కళ్యాణ్ విశాఖ వస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఎవరెవరు సమావేశానికి రావాలి అనేది పూర్తి సమాచారం అందిస్తున్నా మన్నారు. డీసీసీబీ చైర్మన్ పిఏసి సభ్యులు కోన తాతారావు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన రాష్ట్ర జనసేన కార్యకర్తల సమావేశానికి అన్ని జిల్లాల నుండి కార్యకర్తలు హాజరువుతార న్నారన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా కమిటీ సభ్యులు తిప్పల రమణ రెడ్డి, మంత్రివేముల శ్రీనివాస, బేతు చైతన్య కృష్ణ, దూలం గోపి, తిప్పల వంశీరెడ్డి, కోన చిన్నప్పారావు, కిరణప్రసాద్, బీవీ కృష్ణయ్య, మంగ ఈశ్వర్, చదరం నాగేశ్వరావు, బంటు రవి, దాసరి త్రినాథ్, గుంటూరు లక్ష్మి నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సి.ఆర్.ఎస్. పోర్టర్‌లో జనన, మరణ రిజిస్ట్రేషన్‌లు నమోదు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని జనన మరణ నమోదులకై అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్, క్లినిక్‌లు సి.ఆర్.ఎస్ పోర్టల్ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్)లో నమోదు ప్రక్రియ తప్పనిసరిగా చేసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలియజేశారు. నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, క్లినిక్‌లు ఇప్పటికే సి.ఆర్.ఎస్. లాగిన్‌లో నమోదైనవి మినహా మిగిలిన వారు తప్పనిసరిగా ప్రభుత్వం కల్పించిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. జననం, మరణం జరుగుచున్న ఆసుపత్రి, నర్సింగ్ హోమ్, క్లినిక్‌లు వారు సిఆర్ఎస్ పోర్టల్ యూజర్ ఐడిల కొరకు తప్పనిసరిగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ప్రజా ఆరోగ్య విభాగం నందు సంప్రదించి యూజర్ ఐడిలను పొందవలసినదిగా సూచించారు. బిడ్డ జన్మించిన తేదీ నుండి 15 సంవత్సరాలు దాటిన వారు జనన ధ్రువీకరణ పత్రంలో తల్లిదండ్రులు తమ బిడ్డ పేరును నమోదు చేయించుకోకుండా ఉంటే ఆఖరు తేదీ అయిన 2026 జనవరి 21వ తేదీ లోపు తమ బిడ్డ పేరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం

విశాలాంధ్ర - కొమ్మాది: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను పూజించాలని టిడిపి 5వ వార్డ్ అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ (జపాన్) కోరారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని నగరంపాలెం గ్రామంలో మట్టి గణపతి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఉత్సవాల అనంతరం సముద్ర గర్భ జలాలు, తీరప్రాంతాలు కలుషితం కాకుండా ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు వాంద్రా అప్పల రాజు, పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాష్, ఏడవ వార్డ్ కార్యదర్శి కానూరి అచ్చుతారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

విశాలాంధ్ర - అగనంపూడి : మట్టి గణపతిని పూజించండి, పర్యావరణాన్ని కాపాడండి అంటూ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పిలుపునిచ్చారు. వినాయక ఉత్సవాలులో భాగంగా 79 వార్డు జేనసేన కార్యకర్తలు గళ్ళ సాయి, సిరసపల్లి శేఖర్ ఆధ్వర్యంలో 200 మట్టి గణపతి ప్రతిమలను తయారు రూపొందించారు. 79 వార్డు జేనసేన అధ్యక్షుడు మేడశెట్టి విజయ్ ముఖ్య అతిథిగా హాజరై గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితంగా వినాయక ఉత్సవాలు చేసుకుందామని జనసేన నాయకులు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో జనసేన్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఉచిత విద్యుత్‌పై హర్షం

విశాలాంధ్ర - పద్మనాభం: వినాయక చవితి, దసరా నవరాత్రుల్లో మండపాల వద్ద ఉచిత విద్యుత్‌పై పద్మనాభం మండలం శేక్రొండ పంచాయతీకి చెందిన టిడిపి పంచాయతీ ప్రెసిడెంట్ సంగు శ్రీను హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ ఉచిత విద్యుత్తు అందించటం చాలా ఆనందకరంగా ఉందని ఇప్పటివరకు రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా ఎవరూ కూడా ఈ విధంగా పండగలకు ఉచిత విద్యుత్తు అందించింది లేదన్నారు. నారా లోకేష్ చొరవ తీసుకుని ఈ మహోత్సవాలకు ఉచిత విద్యుత్తు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వారికి ఉత్సవ కమిటీలు తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి అన్నారు. 75వ వార్డు టీడీపీ కార్యాలయంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో స్థానిక నాయకులు పెద్దాడ సోము నాయుడు, దొమ్మేటి సోము నాయుడు, శంకర్ రెడ్డి, కాకినాడ అప్పల రాజు, బస అప్పల రెడ్డి, కేత మురళి, కడవల రమణ, పులి అప్పల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: శ్రీ వరసిద్ది వినాయక మహోత్సవం సందర్భంగా తగరపువలస వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు వెంపాడ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహాయ సహకారాలతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. చిట్టివలస సంతపేట అంబేద్కర్ స్కూల్లో పిల్లలకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షంలోని కూడా మట్టి విగ్రహాలు పంపిణీ కార్యక్రమం ఆపకుండా రెండు వేల విగ్రహాలను పంపిణీ చేసినట్టు తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

విశాలాంధ్ర - భీమిలి: రాష్ట్ర ప్రజలకు సాంకేతిక సేవలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి జోన్ 3వ డివిజన్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో గంటా నూకరాజు పాల్గొని లబ్ధిదారులకు అందించారు. సాంకేతికతను ఉపయోగించుకోవడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు ఎన్నో సేవలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన ఘనత చంద్రబాబు నాయుడేదనని అన్నారు.

ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం ప్రభుత్వ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వేములవలస శ్రీ పాండురంగ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రౌతు నాగరాజు నూతనంగా మంజూరైన స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అభివృద్ధి సంక్షేమం కలిపితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోన పైడిరాజు, కూటమిపార్టీ నాయకులు బంటుపల్లి గోవిందరావు, మీసాలు అప్పలరాజు, దొంతల అప్పలరాజు, వీఆర్వో పుష్పలత, రేషన్ డీలర్ అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

కుమార్ రాజు సాహితీ సేవ అభినందనీయం

విశాలాంధ్ర - మల్కాపురం: ప్రముఖ సాహితీ వేత్త, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు సాహితీ సేవ అభినందనీయమని ప్రముఖ పాత్రికేయులు, చిత్రకళా పరిషత్తు అధ్యక్షులు సుంకర చలపతిరావు అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం జరిగిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమార్ రాజు సాహిత్య, సాంస్కృతిక, కళా, సేవా రంగాలకు ఎనలేని సేవ చేస్తున్నారని, అందుకే ఆయనను విశ్వసాహితీ కళావేదిక ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులుగా నియమించింది అని కొనియాడారు. జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రముఖులను సన్మానించడం సమాజ కర్తవ్యం అని అన్నారు. సమావేశానికి గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. అంతకుముందు మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా అంతా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు ద్వారపూడి శ్రీనివాస మనోహర్, జాతీయ సేవా పథక కార్యకర్తలు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత వినాయక చవితికి ప్రాధాన్యత

విశాలాంధ్ర - మధురవాడ: మానవ కార్యకలాపాల కారణంగా దెబ్బతింటున్న ప్రకృతిని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జిఎస్‌బిబి డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు పిలుపునిచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ పర్యావరణ శాస్త్ర విభాగం, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మట్టితో తయారైన వినాయక ప్రతిమలను ఆయన పంపిణీ చేశారు. మట్టి ప్రతిమతో, ప్రకృతిలోని అన్ని వృక్ష జాతులతో జరిపే వినాయక చవితి 'ప్రకృతి పరిరక్షణ' దోహద పడగలదన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సహాయంతో గీతంలో పెద్ద ఎత్తున వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ మాట్లాడుతూ ఆర్భాటం కోసం రంగులతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయిన వినాయక ప్రతిమలు వాడటం వల్ల నిమజ్జనం సమయంతో జలాశయాలు కలుషితం అవుతాయన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, జీవ శాస్త్రాల విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ కె.సురేష్‌కుమార్, గీతం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంసుద్దీన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

2017 యాక్ట్, 1097 హెల్ప్‌లైన్ నంబర్‌పై అవగాహన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో "మీకు తెలుసా" కార్యక్రమం జరుగుతోంది. ఈ అవగాహన కార్యక్రమం ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు కొనసాగనుంది. దీనిలో భాగంగా ఆనందపురం మండలం గిడిజాల గ్రామంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. లింక్ వర్కర్స్ స్కీమ్ సిఎల్‌డబ్ల్యు ఎం.జ్యోతి మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్, టిబి, సుఖవ్యాధులు, 2017 యాక్ట్ 1097 హెల్ప్‌లైన్ నంబర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని గిడీజాల హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించగా, స్కూల్ సిబ్బంది, ఆశావర్కర్ ఎస్.అనసూయ, పి.లక్ష్మి, యువత సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర - తగరపువలస: భీమునిపట్నం రూరల్ మండలం లక్ష్మీపురం శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి సేవాపీఠంలో వినాయక చవితి సందర్భంగా భీమిలి జడ్పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి వెంకటప్పడు మాట్లాడుతూ

పర్యావరణానికి మేలు చేసే విధంగా వినాయక చవితి పండుగను ప్రకృతికి హాని కలగకుండా ఉండేందుకు ప్రజలు మట్టి విగ్రహాలను పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో మజ్జివలస పిఏసిఎస్ అధ్యక్షులు గుడ్డాల ఎల్లయ్య, సింగనబంధ గ్రామం సర్పంచ్ గాడు వెంకటనారాయణ, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యదర్శి గాడు తాతినాయుడు, మజ్జివలస పిఏసఎస్ మాజీ ఉపాధ్యక్షులు కనకల వెంకటరమణ, మజ్జిపేట గ్రామం మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, మజ్జివలస టీడీపీ సీనియర్ నాయుకులు నీలాపు సూర్యనారాయణ, కనకల అప్పలరాజు, కరుబుక్త సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: కాలుష్య రహిత వినాయకుడిని పూజించాలని

ధ్యేయంగా మట్టి వినాయక ప్రతిమలను మండలంలో మంగళవారం పంపిణీ చేశారు. గత నాలుగేళ్ల కాలం నుండి ఓఎస్‌జి ఫౌండేషన్ ఫౌండర్ దళాయి శివ, వెంకట బంగారి, అడ్డూరి. సురేష్, మొల్లి.శంకర్ సభ్యులు ఆధ్వర్యంలో 500 వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు, అలాగే నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఎకో ఫ్రెండ్లీ మట్టి వినాయక విగ్రహాలను కళాశాల అధ్యాపకులకు విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో సిఎమ్ఓ డాక్టర్ ఎస్.సుబ్బరాజు ,అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యత కోసం ఆనందపురం మండలం వేములవలస గ్రామంలో గల పలు పాఠశాలల విద్యార్థులకు స్థానిక పంచాయతీ ఉప సర్పంచ్, టిడిపి యువ నాయకుడు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ వినాయక మట్టి విగ్రహాలను తన సొంత నిధులతో సమకూర్చి మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక వెంకటేశ్వర పాఠశాలలో

250 మట్టి విగ్రహాలు, వేములవలస గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 50, ఎస్సీ కాలనీ పాఠశాల విద్యార్థులకు 50 మట్టి విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్కూల్ డైరెక్టర్ గణేష్, వంశీ, టీచర్లు సుభాషిణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: శ్రీ శ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాదిలా ఈ ఏడాది కూడా రేవిడి సెంటర్లో సుమారు 500 మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో

సంఘం అధ్యక్షులు కోన సన్యాసి నాయుడు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలు పర్యావరణానికి తీవ్ర హానికరమని, వాటిని ఉపయోగించకూడదని అందరూ మట్టి విగ్రహాల పూజించడం వల్ల పర్యావరణ కాపాడవచ్చునని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పద్మనాభ స్వామి, సహాయ కార్యదర్శి కంది సత్యనారాయణ, సభ్యులు చీర కనకరాజు, సంపంగి అప్పలరాజు, బర్ల మధు, ఓమ్మి పైడినాయుడు, పూర్వ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఇంద్రరావు, చిరంజీవి, గ్రామ పెద్దలు, రిటైర్డ్ ఎంపీడీవో మంత్రి ప్రగడ బాపిరాజు, మరగడ వెంకటేష్, పాంద్రంగి ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ కోసం బాదం ఎంతో ఉపయుక్తం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రతిరోజూ బాదం తినడం ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో సహాయపడగలదని రెండు కొత్త సమగ్ర పరిశోధన పత్రాలు ప్రదర్శిస్తున్నాయని న్యూట్రిషన్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి, మాక్స్ హెల్త్‌కేర్ రీజనల్ హెడ్, డైటిటిక్స్ రితికా సమద్దార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో వారు ఆజాగా జరిగిన పరిశోధన ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాదం పప్పులు సంభావ్య ప్రీబయోటిక్స్‌గా పనిచేస్తాయి, ఇది ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహించే మరియు ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్‌కు మద్దతు ఇచ్చే ఒక ఆహార వనరు అన్నారు. బాదం తినడం బ్యూటిరేట్ ఉత్పత్తిని పెంచుతుందన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ యొక్క న్యూట్రిషన్ ఫర్ ప్రెసిషన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్ లీడ్ మరియు పేపర్ సహ రచయిత, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో ప్రొఫెసర్, జాక్ గిల్బర్ట్, "ఈ పరిశోధన బాదం ప్రీబయోటిక్స్‌గా పనిచేసి, గట్ ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడంలో సహాయపడుతుందని సూచిస్తోంది అన్నారు.

జీవీఎంసీ క్లాప్ డ్రైవర్ ఇంటిపై దాడి తగదు

ఖండించిన దళిత సంఘాలు

విశాలాంధ్ర - భీమిలి: జీవీఎంసీ జోన్ 1 రెండో వార్డ్ పరిధి ఆదర్శనగర్ 2లో క్లాప్ డ్రైవర్‌గా పనిచేస్తున్న దళిత కులానికి చెందిన ఇంటి శ్రీనుపై భీమిలి జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప



నాయుడు అకారణంగా దూషిస్తూ భౌతిక దాడిని ఖండిస్తూ తాళ్లవలస అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బోని సన్నిబాబు నాయకత్వన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలు వేసి నివాళు లర్పించారు. పిమ్మట ఉత్తరాంధ్ర దళిత నాయకులు భాగం గోపాలరావు మాట్లాడుతూ రెండవ వార్డ్ ఆదర్శనగర్ లో దళిత కులానికి చెందిన ఇంటి శ్రీనుపై జోనల్ కమిషనర్ అసభ్య పదజాలంతో తిట్టి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జోనల్ కమిషనర్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అలాగే విధుల నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు సియ్యాద్రి రాంబాబు, యాగాటి రామారావు, బెల్లనా అప్పారావు, బోని హరిబాబు, బోని ఆనంద్, బోని ప్రసాద్, మామిడి భాష తదితరులు పాల్గొన్నారు.

గీతం వర్సిటీలో విశాఖ సిటీ ఇన్నోవేషన్ క్లస్టర్ ప్రారంభం

విశాలాంధ్ర - మధురవాడ: విద్యాలయాలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలు, పెట్టుబడి దారులను ఒకే వేదికపైకి తెచ్చి నూతన ఆవిష్కరణలను వ్యాపారాత్మకంగా మార్చడానికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసిటిఇ) సయంట్ సంస్థ సంయుక్తంగా విశాఖలోని వివిధ విద్యాసంస్థలలో నెలకొల్పనున్న ఇన్నోవేషన్ క్లస్టర్‌ను మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. త్వరలో నగరంలోని వివిధ విద్యాలయాలలో సహితం ఇన్నోవేషన్ క్లస్టర్‌లో భాగంగా ప్రత్యేక కేంద్రాలను నెలకొల్పనున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విశాఖ పార్లమెంట్ సభ్యుడు, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ సంఖ్య కంటే నాణ్యతా ప్రమాణాలకు ఇన్నోవేషన్ కేంద్రాలు చిరునామా కావాలని, విశాఖ క్లస్టర్ రాష్ట్రానికే కాక దేశానికే ఆదర్శం కావాలన్నారు. జాతీయ స్థాయిలో ఏఐసిటిఇ నిర్దేశించిన ప్రమాణాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా అన్వయించుకుని విశాఖ ఇన్నోవేషన్ క్లస్టర్‌ను బలోపేతం చేయాలని సూచించారు. ఇన్నోవేషన్ క్లస్టర్‌ల నిర్వహణలో గీతం విశ్వవిద్యాలయం సహకారం అందిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపిఐఎస్) సి.ఇ.ఓ ఎమ్.సూర్యతేజ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఆవిష్కరణ ఆంధ్ర కార్యక్రమానికి యువత నుంచి అనూహ్య స్పందన లభించిందని 24 గంటలలో 1.67 లక్షల మంది రిజిస్టర్ చేసుకోవడం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకు ఎక్కిందన్నారు. ఎ.ఐ.సి.టి.ఇ ఇన్నోవేషన్ కేంద్రం అసిస్టెంట్ ఇన్నోవేషన్ డైరక్టర్ దీపన్ కుమార్ సాహెూ మట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులు స్టార్టప్‌లలో పనిచేస్తున్నా ,స్వయంగా స్టార్టప్‌లను ప్రారంభించినా వాటికి క్రెడిట్ ఇవ్వాలని మొత్తం ఉత్తీర్ణత శాతంలో మార్కులు కలపాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యంగా విశాఖలో ఏర్పాటవుతున్న ఇన్నోవేషన్ క్లస్టర్‌లకు సెయింట్ అందించే సహకారం గురించి పి.సుధాకర్ వివరించగా, సి.ఎస్.ఆర్. విభాగం డైరక్టర్ కృష్ణమోహనదేవి మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపే నూతన ఆవిష్కరణల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో భాగంగా గీతం వెంచర్ దవలప్‌మెంట్ సెంటర్ (వి.డి.సి) డిప్యూటీ డైరక్టర్ వికాస్ శ్రీవాత్సవ ఆధ్వర్యంలో వివిధ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల, విద్యాసంస్థల నిపుణులతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

జీవీఎంసీ అభివృద్ధి పనులపై మున్సిపల్ మంత్రి సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ విజయవాడ సి.ఆర్.డి.ఎ కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం తెలిపారు. ఈ సమీక్ష కార్యక్రమానికి సిడిఎమ్ఎ డాక్టర్ పి.సంపత్ కుమార్, జీవీఎంసీ కమిషనర్‌తో పాటు పిహెచ్ - ఇఎన్‌సి ప్రభాకర్, జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పల్లంరాజు, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకరరావు, పర్యవేక్షక ఇంజనీర్లు కె.వి.ఎస్.రవి, వివివి సత్యనారాయణ రాజు హాజరయ్యారని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా జీవీఎంసీ చేపడుతున్న, పలు ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలపై మున్సిపల్ మంత్రి ఆరా తీశారని కమిషనర్ తెలిపారు. జీవీఎంసీ నందు చేపట్టిన కొత్త ప్రాజెక్టులైన మధురవాడ ప్రాంతంలో ఐ.ఎఫ్.సి. లోన్ ద్వారా భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టు, నీటి సరఫరా అభివృద్ధి కోసం రూ.595 కోట్లతో చేపట్టబడిన ప్రాజెక్టులు, బల్క్ వాటర్ సప్లై ప్రాజెక్టులు, అర్బన్ చాలెంజ్ ఫండ్ ద్వారా చేపట్టబోవు ప్రాజెక్టులు, జి.వి.ఎస్.సి.సి.ఎల్ ద్వారా గాజువాక ప్రాంతాల్లో చేపట్టబడిన పాకేజి-పనులుపై చర్చ జరిగిందని, మిగిలిన పనుల మంజూరుకై కావలసిన నిధుల కొరకు మంత్రికి వివరించడం జరిగిందన్నారు. జీవీఎంసీలో ప్రతిపాదించిన సుమారు రూ.1015 కోట్ల ప్రాజెక్ట్ లన్ని అక్టోబర్ లోపు టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

జీవీఎంసీ సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ద్వారా 1097 అనుమతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆగస్టు 27న జరుగనున్న వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో, అన్ని జోనల్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన జీవీఎంసీ సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ద్వారా నేటికీ 1097 వినాయక చవితి ఉత్సవ నిర్వాహకులకు అనుమతులను మంజూరు చేయడం జరిగిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం తెలియజేశారు. జీవీఎంసీ పరిధిలో ఆగస్టు 27న నిర్వహించబోయే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రజలు, నివాసిత సంక్షేమ సంఘాలు, ఎన్జీవోస్, స్వచ్ఛంద సంస్థలు, ఉత్సవ నిర్వాహణ కమిటీలు గణేష్ ఉత్సవాలు నిర్వహించేందుకు అనుమతుల మంజూరుకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోనూ, అన్ని జోనల్ కార్యాలయంలోనూ సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ద్వారా జీవీఎంసీ అనుమతుల కొరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించగా అందులో 1097 ఉత్సవ నిర్వహణలకు సంబంధించి అనుమతులను మంజూరు చేయడం జరిగిందని కమిషనర్ తెలిపారు. వినాయక ఉత్సవాలు నగరంలో గల పలు కాలనీలలో, రోడ్లపై విచ్చలవిడిగా జీవీఎంసీ అనుమతులు లేకుండా నిర్వహణ చేపట్టడం వలన రోడ్లు, వీధులు, కాలనీలు పాడై ప్రజలకు ఇబ్బంది కలగడమే కాకుండా జీవీఎంసీ కి ఆర్థికంగా నష్టం వాటిల్లుతున్నదని అలాగే పర్యావరణ రహితంగా ఉత్సవ నిర్వాహకులు ఈ ఉత్సవాలను జరుపుతున్న దృష్ట్యా , వాటిని అరికట్టేందుకు ఒక ప్రణాళిక యుతంగా ఈ ఉత్సవాలు జరుపుకునేలా జీవీఎంసీలో, అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్ర ప్రథమంగా ఈ సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ నందు జీవీఎంసీ కి సంబంధించిన పట్టణ ప్రణాళిక, అగ్నిమాపక, ఎలక్ట్రికల్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, జోనల్ స్థాయి అధికారులు ఉత్సవ నిర్వహణకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇచ్చేందుకుగాను ఏర్పాటు చేయడం ద్వారా ప్రణాళికయుతంగా అనుమతులు మంజూరులు జరిగినవని తెలిపారు.

బాధిత మహిళలను అన్ని విధాలుగా ఆదుకోవాలి

జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డా. అర్చనా మజుందార్



విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వివిధ రకాల సమస్యలతో సతమతమయ్యే బాధిత మహిళలకు అధికార యంత్రాంగం అండగా నిలవాలని, తగిన విధంగా తోడ్పాటు అందించాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డా. అర్చనా మజుందార్ పేర్కొన్నారు. వారు అందించే వినతులు, పోలీసు కేసుల విషయంలో చొరవ చూపాలని, పరిపాలనాపరమైన, న్యాయపరమైన సేవలను స్నేహపూర్వక వాతావరణంలో అందించాలని సూచించారు. జన సునవాయి పేరుతో విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో బాధిత మహిళలు అందించిన పలు ఫిర్యాదులను పరిశీలించిన క్రమంలో జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఈ విధంగా స్పందించారు. పోలీసు, రెవెన్యూ, న్యాయ విభాగాల బాధిత మహిళలకు అన్ని సమయాల్లో అండగా నిలవాలని, తగిన విధంగా తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమెతో పాటు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ రాయపాటి శైలజ, మెంబర్ జయశ్రీ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, కృష్ణకాంత్ పాటిల్ ఇతర అధికారులతో కలిసి డా. అర్చనా మజుందార్ బాధిత మహిళల నుంచి వినతులు స్వీకరించారు. పలు అంశాలపై ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మహిళలు 54 వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్నయిదేవి, పీడీ రామలక్ష్మి, జడ్పీ సీఈవో నారాయణమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, డీఈవో ప్రేమ్ కుమార్, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్, మేయర్‌లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగర ప్రజలకు మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వినాయక చవితి శుభాకాంక్షలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ నేడు నిర్వహించే వినాయక చవితి సందర్భంగా ఘనములకు అధిపతి అయిన వినాయకుని పూజిస్తే సకల కార్యాలు సిద్ధిస్తాయని అందుకు నగర ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ వినాయక చవితి పండుగను ఒక క్రమశిక్షణతో పర్యావరణ హితవరంగా జరుపుకోవాలని సూచిస్తూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు వారిరువురూ తెలియజేశారు.

పండుగ సందర్భంగా బజాజ్ పల్సర్‌పై ప్రత్యేక రాయితీలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: రానున్న పండుగ సీజన్ పురస్కరించుకొని బజాజ్ పల్సర్ బైక్ కొనుగోలుపై పలు రకాల రాయితీలు అందిస్తున్నట్లు ఆ స్టోర్ ప్రతినిధి వెల్లడించారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ద్విచక్ర మరియు త్రిచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో లిమిటెడ్, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఈశాన్య మరియు ఉత్తరప్రదేశ్‌లను కలుపుతూ తన హ్యాట్రిక్ ఆఫర్‌ను ఈరోజు మార్కెట్లలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. పరిమిత కాల వేడుక చొరవగా రూపొందించబడిన హ్యాట్రిక్ ఆఫర్, పల్సర్ శ్రేణిపై ప్రత్యేక ధరలు, నగదు ప్రయోజనాలు, విలువ కలయికల యొక్క ట్రిపుల్ ప్రయోజనాన్ని రైడర్‌లకు అందిస్తుంది. హ్యాట్రిక్ ఆఫర్ కస్టమర్లకు రూ. 10,000 విలువైన ప్రయోజనాలను అందిస్తుందన్నారు. దీనికి మూడు దశలు ఉన్నాయని, మొదటిది, క్యాష్‌బ్యాక్ ఆఫర్, రెండవది, బీమా పొదుపులు, మరియు మూడవది, ప్రాసెసింగ్ రుసుము లేదు అని అన్నారు.

జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీలో స్థానం కల్పించాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కమిటీ అనుబంధ సంఘాల నియామకం కోసం రాష్ట్ర పరిశీలకులు నిమ్మల రామానాయుడు, రాంభూపాల్ రెడ్డి, సత్తిబాబుల ఆధ్వర్యంలో రాష్ట్ర టీడీపి అధ్యక్షులు, గాజువాక నియోజక వర్గ శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు పర్యవేక్షణలో విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ విశాఖ టీడీపీ కార్యాలయములో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో పాల్గొన్న 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, పెద్దాడ సోము నాయుడు, గంట్యాడ పోలయ్య, కాకినాడ అప్పల రాజు, టీడీపీ నాయకులు శ్రీమునిరీ శ్రీనివాస రావు, కడవల రమణ,దొమ్మేటి సోము నాయుడు తదితరులు కలిసి ఈ సారి ఏర్పాటు చేసే రాష్ట్ర, జిల్లా అనుబంధ కమిటీలలో 75వ వార్డు కి చెందిన నాయకులకు సముచిత స్థానం కల్పించాలని వినతి పత్రం అందజేశారు.

సెప్టెంబర్ 12న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వ సభ్య సమావేశం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విశాఖపట్నం జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, ఇండియన్ రెడ్డిన్ సొసైటీ అధ్యక్షుడు ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సెప్టెంబర్ 12న నిర్వహించనున్నారు. ఇండియన్ రెడ్రెస్ సొసైటీ, విశాఖపట్నం జిల్లాకు చెందిన పేట్రాన్స్ ,వైస్-పేట్రాన్స్ ,లైఫ్ మెంబెర్స్ ,లైఫ్ అసోసియేట్ మెంబెర్స్ అందరూ తమ ఆధార్ కార్డ్, సభ్యత్వ కార్డులతో 12 సెప్టెంబర్ ఉదయం 11 గంటలకు నగరం లోని అంబేద్కర్ భవన్, రామ టాకీస్ దగ్గర హాజరు కావాలని తెలిపారు. కనీసం 10 మంది సభ్యులతో కూడిన జిల్లా బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ ఎన్నుకోబడుతుందన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారులను తమలో తాము ఎన్నుకుంటారని అన్నారు. జిల్లా సహకార అధికారి ఎన్నికలను నిర్వహించనున్నారని సొసైటీ కార్యదర్శి తెలిపారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - పద్మనాభం: మద్ది గ్రామంలో కృష్ణాష్టమి నుండి కొలువు తీరిన శ్రీకృష్ణ మహోత్సవాలు, స్వామి వారికి ప్రతి రోజు ఉదయం సాయంత్రం జ్ఞాన రీత్యా నిత్య పూజలు, భగవద్గీత శ్లోక పారాయణం చేసి 11 వ రోజు ఆగస్టు 26న ఈ రోజు అనగా మంగళవారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పుర వీధులలో అంగరంగ వైభవంగా జరిగింది. ఊరేగింపు తో కృష్ణాష్టమి వేడుకలు ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అధ్యక్షులు పద్మనాభం మండలం కే రాంబాబు విశాఖపట్నం జిల్లాపశుఘన అభివృద్ధి సంఘం చైర్మన్ జడ్పిటిసి భీమునిపట్నం

మండలం గాడు వెంకటప్పడులు విచ్చేసి స్వామికి కాయ కర్పూరం సమర్పించి పల్లకీ సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు, సభ్యులు కే.త్రినాథ రావు గారులి, జి. కృష్ణ సూరప్పడు, పోలీసు నాయుడు, వి.సురేష్, ఎస్ .శ్రీనివాసరావు, బి.పైడన్న, కే.సంతోష్, లక్ష్మి, వి.భవాని, గాయత్రి, పి.అప్పలనాయుడు, సూర్య నారాయణ పాల్గొన్నారు.

29 నుంచి తెలుగు టైటాన్స్ ప్రొ కబడ్డీ లీగ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 11 సీజన్లుగా ఘన విజయాన్ని నమోదు చేసిన ప్రొ కబడ్డీ లీగ్, ఈసారి 2025 ఆగస్ట్ 29 నుంచి అక్టోబర్ 23 వరకు జరగనుంది. ప్లేఆఫ్‌కు సంబంధించిన వివరాలు తరువాత ప్రకటించబడతాయి. మంగళవారం తెలుగు టైటాన్స్ పి కే ఎల్ సీజన్ 12 కోసం తమ కొత్త జట్టును ప్రకటించింది. మొత్తం 12 జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో ప్రతి జట్టు 18 లీగ్ మ్యాచ్‌లు ఆడుతుంది. టాప్ 6 జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత పొందతాయి. తెలుగు టైటాన్స్ సీఈఓ డా. త్రినాథ్ రెడ్డి మాట్లాడుతూ "వైజాగ్‌లో తెలుగు టైటాన్స్ అభిమానుల కోసం కబడ్డీ మళ్లీ మొదలవుతోం దన్నారు. తెలుగు టైటాన్స్ కోచ్ కృష్ణ కుమార్ హుడా

మాట్లాడుతూ "కబడ్డీ అనేది అత్యంత ఉత్కంఠభరితమైన క్రీడ అని, సీజన్ 12లో మా జట్టు ఎన్నడూ లేనంత బలంగా ఉందన్నారు. ఈ సీజన్‌లో కొత్త స్ట్రాటజీలతో పాటు అభిమానులను ఆకట్టుకునే కొత్త మార్గాలను కనుగొంటామన్నారు. కెప్టెన్ విజయ్ మాలిక్‌తో కలిసి ఈ జోరును కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాం అని తెలిపారు. జట్టు కెప్టెన్ విజయ్ మాలిక్ మాట్లాడుతూ "ప్లేయర్లంతా సురక్షితంగా ఉన్నారని భావించాలి. వారిని ఆత్మవిశ్వాసంతో నింపాలి. వారు 100 శాతం ప్రతిభ చూపాలంటే, ముందు వారిని సురక్షితంగా అనిపించేలా చేయాలన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు

స్పష్టం చేసిన ఎంపీ శ్రీభరత్, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ ఉక్కు ఎన్నటికీ ప్రైవేటీకరణ జరగదని ఎంపీ శ్రీ భరత్ స్పష్టం చేశారు. మంగళవారం తన నివాసంలో నిర్వహించిన పార్లమెంట్ కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకులు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరుగుతుందని తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని ధ్వజమెత్తారు. విశాఖ ప్రజల గర్వకారణమైన స్టీల్ ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకు రావడమే మా లక్ష్యం అన్నారు. ప్రస్తుతం ఉక్కు కర్మాగారం లోని మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తి సామర్థ్యంతో నడుస్తు న్నాయని, కాస్ట్ తగ్గించే చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ వెల్లడించారు. ప్లాంట్‌కు సంబంధించిన భూములు అమ్మే ప్రశ్నే లేదని, ఎన్ ఎం డి సి కి కేవలం లీజ్ ప్రాతిపదికన మాత్రమే ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఉక్కు కర్మాగారాన్ని లాభాల దిశగా నడిపించడానికి సమర్థవంత మైన నాయకత్వాన్ని అందిం చాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరానన్నారు. రాబోయే రోజుల్లో కర్మా గారానికి సంబంధించిన వివిధ సమస్యలకు సమగ్ర పరిష్కారాలు లభిస్తాయినే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

విశాఖ అభివృద్ధికి కేంద్రం వద్ద వినతిపత్రాలు:

ఇటీవల రైల్వే మంత్రితో మాట్లాడి విశాఖ-బెంగళూరు కొత్త రైళ్లు, విశాఖ-తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కోసం విజ్ఞప్తి చేశామని, మంత్రి స్పందన సానుకూలంగా ఉన్నదని ఎంపీ భరత్ అన్నారు. మంగళ పాలెం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌పై కూడా స్పందించారని, త్వరలో సమస్య పరిష్కారం కానుందని తెలిపారు. త్వరలో దక్షిణ భారత నోడల్ హబ్‌గా విశాఖలో డిసేబిలిటీ స్పోర్ట్స్ సెంటర్, మార్షల్ ఆర్ట్స్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించినట్లు చెప్పారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పుడు మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు రన్ అవు తున్నాయి కాబట్టి ప్లాంట్ లాభాల దిశగా పయనిస్తోందని, వాంట్ ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడమే మా ధ్యేయమన్నారు. అందుకు అను గుణంగా అన్ని చర్యలు తీసుకుంటాం అని పేర్కొన్నారు. బీజేపీ తరపున విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఉక్కు కర్మా గారం ప్రైవేటీకరణ చేయాలనే లక్ష్యం కేంద్రానికి లేదు. కేవలం నిర్వహణ సౌలభ్యం కోసం కొన్ని కాంట్రాక్టులు ఇచ్చే అవకాశం ఉంటుందని, కానీ ప్రైవేటీకరణకాదని స్పష్టం చేశారు.